"ఇందులో రావూగారి మహిమేమీ లేదు. అంతా జగన్నాథ మహిమే" అంటూ నవ్వేడు. టి.బి. స్పెషలిస్ట్ డాక్టర్ రెడ్డి.

"అంటే" అమాయకంగా మొహం పెట్టేడతను.

రావుగారిని రక్షించడానికా అన్నట్టుగా రెడ్డిగారే మళ్ళీ అందుకున్నారు.

"చెప్తానుండండి! అన్ని హాస్పిటల్స్‌కి మందు లెక్కడ నుండొ స్తాయి? గవర్నమెంటునుంచే! గవర్నమెంట్‌లీ చిల్లర దుకాణం పెట్టుకూర్చోలేదు. ఏరోజు మందులారోజు మన కమ్మడానికి. అంచేత ప్రతి హాస్పిటల్‌కి వాళ్ళ డిమాండ్‌ని బట్టి, వీళ్ళ వీలుని బట్టి పెన్సిలిన్ కొంటారో పిప్పరమెంట్లే కొంటారో? కొనుక్కోం డని ఎంతో కొంత డబ్బు మొహాన పడేస్తుంది. అంతే. అక్కడితో వాళ్ళ బాధ్యతతీరిపోతుంది. గవర్నమెంటు డబ్బులిచ్చి కంపెనీలు మందులిస్తే మరికొరతేమిటని మీడౌటు! అదే జగన్నాథం మహిమ, ఎలా గంటారా? మాటవరసకి పెన్సిలిన్ తీసు కుందాం. పన్‌డోస్ వయిల్ ఖరీదెంత? మీకు తెలీదా? నాకూ సరిగా తెలీదు. ఈ రోజు ధరెంతో సుళువుకోసం రూపాయను కుందాం. ఫైవ్‌డోస్ వయలెంత? ఐదు రూపాయలా? కాదు మూడు రూపాయలే! మన జిల్లాకి నెలకి పన్నెండు వేలు శాంక్షనైందనుకుందాం ఆ డబ్బుతో వన్‌డోస్ వయల్సు కొంటే పన్నెండు వేలు ఫైవ్‌డోస్ వయల్సేకొంటె ఇరవై వేల డోసులు వస్తాయి. మొదటిది కొంటె కంపెనీ వాడికి లాభం. రెండోది కొంటే పేషెంట్స్‌కి లాభం. ఎందుచేత నంటే కంపెనీవాడు కొట్టేసే కమిషను సీసాలెక్క నుంటుంది గాని డోసుల్లెక్కనుండదు. కంపెనీ వాళ్ళకి కావలసింది తమ లాభంకాని పేషెంట్ల లాభంకాదు. మనపై ఆఫీసర్లక్కూడా పేషెంట్ల శ్రేయస్సు కంటే కంపెనీల శ్రేయస్సే ముఖ్యమైనప్పుడు మనకు మందులైపోతూనే వుంటాయి. మరింక నాచేత వివరాలు చెప్పించకండి" అన్నాడు అక్కణ్ణుంచి లేచిపోతూ.

కుర్ర డాక్టరింకా అసలు విషయం అందలేదన్న సంగతి గ్రహించిన మాధవరావు వివరాలు కూడా చెప్పేశాడు. "మన గురువులు కంపెనీవాళ్ళ దగ్గర కక్కుర్తి పడతారన్నమాట".

**(1973)**

# ఇది కథ కాదు

శ్రీనివాసరావు సిటీబస్ దిగేడు.

సుశీల కూడా అదే బస్సు దిగింది.

శ్రీనివాసరావు బాపూ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్ళాలి.

సుశీల బాపూ రోడ్డువేపుకే తిరిగింది.

శ్రీనివాసరావు ఒళ్ళు జలదరించింది. రెప్ప వెయ్యటం మర్చి పోయాయి అతని కళ్ళు. అడుగు వెయ్యడం మర్చిపోయాయి అతని కాళ్ళు. అతనికి ఆమెని తెలీదు. అయినా తన కాబోయే ప్రేయసిని అతను వెనుకనుంచైనా పోల్చుకోగలడు. అతనికి పాతికేళ్ళు.

అతని ప్రకారం ఆమెకి యిరవై దాటడానికి వీల్లేదు. అంచేత ఆవిడకి యిరవైయ్యే.

ఆమె అతనికంటే పాతిక గజాలు ముందు నడుస్తోంది. ఆమె కట్టుకున్న తెల్ల సిల్కు చీర ఆమెని పొగమంచులా కమ్ము కుంది. దాని జరీ అంచు బంగారు పాముపొరలా ఆమెని నిలు వునా చుట్టుకుంది. ఆమె జోళ్ళ ఎర్ర పట్టీలు పాదాల రంగులో కలిసిపోయేయి.

శ్రీనివాసరావు గుండెలు కడుపులో కలిసిపోయేయి. జోరు జాస్తి చేసి సుశీలను దాటిన అతను ఆగి వెనక్కి తిరిగేడు.

అన్ని వేగాల్లోనూ మనోవేగం ఎక్కువంటారు. కాని మనో వేగం కంటే ఎక్కువ ప్రేమవేగం అంటాడు శ్రీనివాసరావు. అంచేత ఆ పాతిక గజాలు దాటడానికి అతనికి పది లిప్తలు పట్టలేదు.

ఆమె ముక్కు మూరెడుంది.

కళ్ళు చారెడున్నాయి.

మూతి ముప్పావించి ఉంది.

అంత నల్లటి జుత్తు లేకపోయినా ఆమె మొహం బాగా తెల్లగానే కనిపించేంది.

"నల్ల ముత్యాలు కూడా వుంటాయి కాబోలు" అనుకుంటారు. ఆమె తెల్లని మెడలో ముత్యాల గొలుసుని చూసిన ఎవరైనా.

శ్రీనివాసరావు నవ్వేడు. అతని పళ్ళు కట్టుడు పళ్ళలా అందంగా వున్నాయి.

సుశీల పళ్లు ఎలా ఉన్నాయో చెప్పడం కష్టం. ఆమె నవ్వలేదు. ఆమె కనుబొమలు ఒక్క ముడివేసి విప్పేసింది.

రెండో రోజు ఆఫీసు వదిలిన శ్రీనివాసరావు 7వ నెంబరు బస్సే ఎక్కేడు. సుశీల కూడా ఆ బస్సే ఎక్కింది. అతని ముందు సీటులోనే కూర్చుంది.

అతనికి ఆమెతో పరిచయం చేసుకోవాలనీ, ఆ పరిచయం మొగ్గ పెళ్ళి పువ్వుగా విడాలనీ నిన్ననే అనిపించింది. కాని ఆమెని పలకరించడం ఎలా?

ఆడవాళ్ళని ప్రేమించడం చాలా సులభం.

కాని పలకరించడం గొప్ప ఆర్ట్.

మొదటిది అందరూ చెయ్యగలరు. చేస్తారు.

రెండోది కొందరే చెయ్యగలరు.

శ్రీనివాసరావు రెండోదానికి రెడీగా వున్నాడు.

"టైమెంత?" అని అడిగితే.

శ్రీనివాసరావు చేతికి తాటికాయంత వాచీ మెరుస్తోంది

పక్కనున్న సెట్టికి యింకా మంచి వాచీ గుమ్మడికాయంత వుంది. పోనీ.

"పెన్నుందా?" అని అడిగితే.

తప్పులేదు అడగొచ్చు కానీ.

"దేనికి?" అని అడిగితే.

చెవులు గోక్కోడానికి అనాలి. అతని జేబులో బస్ టికెట్ మినహా కాయితం ముక్క లేదు.

శ్రీనివాసరావు తెలుగు, హిందీ చాలా సినిమాలు చూస్తాడు. చాలా సినిమాల్లో ప్రేమ బస్సులోనో, కాలేజీలోనో ప్రారంభం అవుతుంది. సినిమాల్లో హీరోయిన్లని పరిచయం చేసుకోవడానికి హీరోలకి మంచి ఛాన్సులు యిస్తారు డైరెక్టరు.

బస్ కండక్టర్లకి సినిమా డైరెక్షను రాదు!

ఆమె రుమాలు కింద పడిపోతే!

తలలో గులాబీ గాలికి ఎగిరిపోతే!

ఆమె రుమాలు కింద పడెయ్యలేదు. సరికదా బస్ దిగేటప్పుడు లంచ్ బాక్సు హేండ్‌బ్యాగు కూడా అతి భద్రంగా పట్టుకొని మరీ దిగింది.

మహా గొప్ప జాగ్రత్త గల పిల్ల!

శ్రీనివాసరావూ దిగేడు ఆమె వెనకే.

బాపూ రోడ్డులో నాలుగు ఫర్లాంగులు దిగబెట్టేడు. ఆ తర్వాత ఆమె మందురోజులాగే చీకటి సందులోకి వెళ్ళిపోయింది.

శ్రీనివాసరావుకి మిగిలివున్న అవకాశం ఒక్కటే కనిపించింది. ఏప్పుడైనా ఏ దయామయుడైన రౌడీనో ఆమెను ఆ సందులో సైంధవుడిలా పట్టుకుంటే, తనువెళ్ళి రక్షించి, మొన్న "కంచుమనిషి" సినిమాలో కృష్ణారావులా కృతజ్ఞతలు, కన్నీళ్ళు, వెన్నెల నవ్వులు, నవ్వుల పాపలు ఓహ్...

అదొక్కటే అతని కోరిక...

❖ ❖ ❖

కోరికలు మనిషన్న ప్రతి వాడికీ వుంటాయి. కాని అవకాశాలు ఏ కొందరికో కాని రావు. అసలు కొందరికి రానే రావు. కాని శ్రీనివాసరావు కోరుకున్న ఆ అవకాశం రానే వచ్చింది. చీకటి సందులోకి తిరిగిన సుశీల కెవ్వున కేక వేసింది. సందు దాటి శ్రీనివాసరావు గప్పున గెంతేడు సందులోకి. వణుకుతున్న ఆమె కంఠస్వరం అందరి హీరోయిన్ల కంఠస్వరానికీ మించివున్నా, ఆమె పక్కనే నేలని ఒక కాలు ఆనించి, సైకిలు మీద కూర్చుని, ఆమె భుజంమీద ఒక చెయ్యి వేసిన రౌడీ మాత్రం అందరు విలన్ల కంటే భయంకరంగా వున్నాడు.

అతని చెంపలు దవడల దాకా వున్నాయి.

అతని తోలుబెల్టుకి ఇత్తడి ముళ్ళున్నాయి.

అతని మీసాలు మారీచుడి మీసాల్లావున్నాయి.

శ్రీనివాసరావు భారతం చదవలేదు కాబట్టి కాని లేకపోతే బహుశా కీచకుడు ఇలాగే వుండి వుండేవాడు అనుకున్నాడు. అతను శ్రీనివాసరావుని కొట్టిన దెబ్బ ఘటోత్కచుడి దెబ్బలా ఉంది.

దెబ్బకి కిందపడిన శ్రీనివాసరావు వీరాభిమన్యుడిలా లేచాడు. ఆవిడని రక్షించడానిక్కాదు. తనని రక్షించు కోవడానికి.

అతనికి ఆ తర్వాత జ్ఞాపకం వున్న విషయాలు – గాలిలోకి ఎగరడం – రౌడీని కడుపు మీద తన్నడం.

అతని చీకటి కళ్ళకి వెల్తురు వచ్చేసరికి రౌడీ లేదు.

రౌడీకంటే భయంకరంగా చూస్తున్న హీరోయిన్ ఉంది.

శ్రీనివాసరావు మనసు అప్పుడు ప్రేమ, పెళ్ళి మీదికి వెళ్ళ

లేదు. బతికి బావుంటే మేనమావ కూతుర్ని చేసుకోవచ్చు. లేక పోయినా ఫరవాలేదు, కాని అలాగే అక్కడే ఆ సందులోనే ఒక అరగంట నిద్రపోనిస్తే బావుండు ననిపించింది. కానీ సుశీల అతన్ని నిద్రపోనివ్వలేదు.

ఆవిడ శ్రీనివాసరావు కంటే ఎక్కువ సినిమాలు చూస్తుంది. తెలుగు, హిందీలే కాకుండా, అరవ, కన్నడ, మళయాళ వగైరాలన్నీ చూస్తుంది. "బంగారపు బొమ్మ"లో యిలాగే విలన్ ఒక లాలూచి రౌడీని హీరోయిన్ మీదికి వదిలి ఆవిడని రక్షించినట్టు నటించి, ఆమెని పెళ్ళాడి అంట్లు తోమించి నానా బాధలు పెట్టేడు.

"... ఇలా బేడా పరక ఆలోచన్లకి పడే రకాన్ని కాదు నేను. ఏవనుకుంటున్నావో! కాని ఆ రౌడిగాడ్ని వదిలి నన్ను రక్షించినట్టు నటించి నువ్వు పెళ్ళాడేద్దామను కున్నా వేమిటో.." వారం నుండి చూస్తున్నాను. కుక్కలా నావెంటే .... సుడిగాలి వెళ్ళిపోయింది సుశీల రూపంలో.

ఘటోత్కచుడి దెబ్బకైనా తట్టుకున్న అతను హీరోయిన్ దెబ్బకి తట్టుకోలేకపోయాడు.

**(అనామిక, 1.2.1975)**

# పట్నపురాణి తలపోటు

**ఆ** రోజు ఆదివారం.

అష్టమి, అర్ధరాత్రి, పన్నెండుదాటి పది నిమిషాలైంది. అష్టమి చంద్రుడు అతి కష్టంగా డ్యూటీకి వచ్చి పెందలాడే లీవు తీసుకొని పోయేడు.

పిల్లగాలులు చల్లగా, చలిగా తగుల్తున్నాయి.

అది చీకటి రాత్రో వెన్నెల రాత్రో తెలీకుండా చీకటి, వెన్నెల కలిపి నేసిన కలనేత కోకలా ఉంది ఆకాశం.

వయసు వేడిలో చంద్రుడితో పాటు చిందులాడిన చుక్కలు చంద్రుడు పోగానే చలి గుర్తుకొచ్చి కాబోలు గడగడ వణికిపోతున్నాయి.

మోడెల్లా వారి ఊలు దుప్పటిలా దిగిందియింతలో ఓ నల్ల మబ్బు.

అప్పటి వరకు చంద్రుడికి కన్నుకొడుతున్న నక్షత్రాలు మబ్బు దుప్పటి కోసం కలబడి కొట్టుకుంటున్నాయి, మార్చి, మార్చి కప్పుకుంటున్నాయి.

మొత్తంమీద ప్రపంచం, ప్రకృతి అంతా నిశ్శబ్దంగా నిద్ర పోతోంది. ఎటొచ్చీ నిశ్శబ్దంగానే వున్నా నిద్రపోనివి ఊరికి ఒక చివరున్న బంగళా, రెండో చివరున్న స్మశానం.

ఊరికి కొంచెం దూరంలో కాస్త మెరుగ్గా వున్న స్థలంలో వున్న ఆ బంగళా వేటకొచ్చిన రాజుగార్లా గంభీరంగానూ, దర్జాగానూ ఉంది.

భయంతో చేతులు కట్టుకొని బాబుగారి ముందు నిల్చున్న బానిసల్లా వున్నాయి ఊర్లో అక్కడక్కడున్న పాకలు.

రాజుగారు వేటాడి తెచ్చిన మృగాల్లా వున్నాయి ఆ పాకల మధ్య రెండు పెంకుటిల్లు.

స్మశానంలో మంటలే గాని మనుషుల్లేరు.

బంగళాలో మనుషులు మంటల్ని మింగేసిన వాళ్ళలా గాబరాగా ఉన్నారు.

వాళ్ళు అసలు మనుషుల్లా కాకుండా దెయ్యాల నీడల్లా తిరుగుతున్నారు.

బిగుసుకొని పోయిన వాళ్ళ మొహాలు చూస్తుంటే బహుశా ఆ బంగళా మరో నిమిషంలో పేలిపోతుందేమోనన్న భయం వేస్తుంది.

ఆ భయానికి ఒంట్లో వున్న రక్తం అంతా నీరైపోయినట్టు అందరూ పాలిపోయి ఉన్నారు.

బంగళా అంత విశాలంగా వున్నా పక్కవాడి ఊపిరితోనే ప్రాణం పోసుకుంటున్నట్టు ఒకడి మొహంలో ఒకడు మొహం పెట్టి అర్థం కాని ప్రశ్నార్థకాలు వేసుకుంటున్నారు.

అసలెవరు వీళ్ళంతా?

ఇంకెవరు జమీందారు రామనాథం గారి దాసజనం.

వాళ్ళంతా అలా భయంతో వణికిపోతున్నారేం?

పక్కనున్న అడివిలోంచి పెద్ద పులో, సింహమో తప్పించుకు వచ్చెయ్య లేదు కదా!

బావుంది, పక్కన అడివే లేందే!

పక్కనున్న ఒక్క సముద్రం ప్రశాంతంగా ఉందే.